andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.4 , కనిష్ఠం 23.9
నిర్మల్ జిల్లా వార్తలు
8
గురువారం 31 అక్టోబరు 2024



ఘనంగా ముగిసిన సప్తాహ వేడుకలు



కుభీర్, అక్టోబరు 30 : మండలంలోని పార్డి(కే) హనుమాన్ ఆలయంలో గత వారం రోజులుగా కొనసాగుతున్న సప్తాహ వేడుకలు బుధవారం ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయంలో ఉదయం దేవతామూర్తులకు పట్టు వస్త్రాలను సమర్పించి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భజనలు, భక్తిసంకీర్తనలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. గ్రామస్థులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని

కలిసిన డీసీసీ అధ్యక్షుడు



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న డీసీసీ, చైర్మన్

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు అయన వెంట ఉన్నారు. నిర్మల్ మున్సిపాలిటీ నిలిచిపోయిన నిధులు విడుదల చేయాలని కోరారు. రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు మంజూరు, తదితర వాటిని సీఎం దృష్టికి తెచ్చారు. సీఎం సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం



సన్మానిస్తున్న మాజీ మంత్రి ఐకే రెడ్డి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నూతన గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీని బుధవారం మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సన్మానించి అభినందించారు. నాయకులు ధర్మాజీ రాజేందర్, రమణారెడ్డి, దశరథ్ రాజేశ్వర్, ఆమెడ శ్రీధర్, శ్రీకాంత్ యాదవ్, పాల్గొన్నారు.

వికలాంగుల జిల్లా కమిటీ

ఏర్పాటుకు దరఖాస్తు చేయండి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వికలాంగుల కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా శిశు సంక్షేమ, దివ్యాంగ, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నియమించే కమిటీలో అర్హులు వచ్చే నెల 6 సాయంత్రం 5లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొదటి కేటగిరీలో ఐదుగురు దివ్యాంగ స్వచ్ఛంద సంస్థలు, రెండో కేటగిరీలో దివ్యాంగులలో పరిజ్ఞానం, అనుభవం గల ఐదుగురు సభ్యులను కమిటీలో నియమించనున్నట్టు తెలిపారు.

పదవీ విరమణ చేసిన

ఎస్సై, ఏఆర్ ఎస్సైలకు సన్మానం



నిర్మల్ కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం దిలావర్‌పూర్ ఎస్సైగా పని చేస్తున్న రాజేశ్వర్‌గౌడ్, ఏఆర్ ఎస్సై విఠల్ పదవీ విరమణ సందర్భంగా ఎస్పీ జానకిషర్మిల వారిని సన్మానించారు. పోలీసుశాఖలో సుదీర్ఘ కాలం సేవలందించి పదవీ విరమణ చేయడం అభినందనీయమన్నారు. వారు కుటుంబ సభ్యులతో సంతోషంగా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. యూనిస్‌అలీ, రామ్ నిరంజన్, శేఖర్, రమేష్, రామకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో దీపావళికి సర్వం సిద్ధం



- నేడే వెలుగుల పండుగ
- దీపకాంతులతో జిగేల్ మననున్న లోగిళ్లు
- ఇంటింటా లక్ష్మీ పూజలకు ఏర్పాటు
- మోగిన టపాకాయల ధరల మోత

ముథోల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దీపావళి అంటే దీపాల వరుస.. పటాకుల మోతలు.. కాకరపూల కాంతులు.. భూచక్రాల వెలుగులు.. చిచ్చుబుడ్ల వెలుగులు.. పసందైన పిండవంటలే కాదు. అల్లరి పిల్లలు, పెద్దలు, కేరింతలు, తుళ్లింతలు కలగలిసిన పండుగ! వెలుగు పూల వేడుక..! చీకట్లను పారదోలి వెలుగులను నింపే దివ్వెల పండుగ దీపావళికి జిల్లా అంతా సిద్ధమైంది. ఇళ్లను శుద్ధి చేసి రంగు రంగుల పూలు, మామిడాకుల తోరణాలతో అలంకరించుకోనున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులతో ప్రతీ ఇల్లు శోభను సంతరించుకోగా, లక్ష్మీపూజలు, నోములకు ఏర్పాట్లు చేసుకున్నారు. గురువారం దీపావళి ఉండటంతో జిల్లా వ్యాప్తంగా దీపావళి సందడి మొదలైంది.

● మొదలైన దీపావళి సందడి

కటిక చీకట్లు కరిగిపోయేలా.. కాంతిరేఖలు వెల్లివిరియాలి. ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆర్థిక ప్రమిదలో కొత్త చమురుపోయాలి. మైనపు దీపాలు వెలిగినప్పుడు అవి ఆరిపోయేంత వరకే వెలుగు. మనసు దీపాలు వెలిగించగలిగితే అది అనంత కాంతులు వెదజల్లే వేయి రెక్కల వెలుతురుగా మారుతుంది. దానిని మరింత కలుషితం చేసుకోకుండా చూసుకోవడమై మన కర్తవ్యం. సందడి కోసం కాకుండా కాలుష్యాన్ని నియంత్రించ గలిగే టపాసులు కాల్చుతూ జాగ్రత్తలు పాటిస్తూ, దీపావళిని సురక్షిత వేడుకగా చేసుకుందా. అన్ని ప్రధాన కూడళ్ల వద్ద టపాసులను ఏర్పాటు చేశారు. వీటి వద్ద కొనుగోలుదారులతో సందడి వాతావరణం నెలకొంది.

● గ్రీన్ క్రాకర్స్ సురక్షితం

గతంలో మార్కెట్‌లో లభ్యమయ్యే టపాసుల్లో రేడియం నైట్రేట్‌ను ఉపయోగించేవారు. దీని వల్ల వాయు, శబ్ద కాలుష్యాలతో పాటు అనారోగ్య సమస్యలు కూడా ఏర్పడేవి. దీంతో గ్రీన్ క్రాకర్స్‌ను మాత్రమే తయారు చేసేలా చూడాలని 2019లో సుప్రీంకోర్టు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆదేశించింది. ఇప్పుడు మాత్రం మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. వీటిని కాల్చడం ద్వారా కాలుష్యం బారిన పడకుండా ఉండవచ్చు. సాధారణ టపాసుల మాదిరిగానే కాంతి, శబ్ధాన్ని విడుదల చేసే గ్రీన్ క్రాకర్స్ మామూలు వాటికంటే 70 శాతం సురక్షితం అని నిపుణులు చెబుతున్నారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది టపాసుల ధరలు 45 శాతం మేర పెరిగాయి. తారాజువ్వలు, చిచ్చుబుడ్లు, పిట్ట బాంబులు, భూచక్రాలు వంటి వాటి ధరలు 30 నుండి 45 శాతం మేర పెరిగాయి.

● టపాసులు కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

టపాసులు కాల్చే సమయంలో కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలి. సాధ్యమైనంత వరకు బిగుతు వస్త్రాలను ధరించాలి. వీటిని ధరించడం వల్ల మంటలు వ్యాపించవు. చిన్న పిల్లలను, గర్భిణీలు టపాసుల శబ్ధానికి దూరంగా ఉండాలి. లేదా చెవుల్లో దూదిని ఉంచుకోవాలి. అవకాశం ఉన్నంత వరకు గ్రీన్ క్రాకర్స్ మాత్రమే కాల్చాలి. చిన్న పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దవాళ్లు పక్కనే ఉండాలి. తప్పనిసరిగా కళ్లకు అద్దాలు పెట్టుకుని టపాసులు కాల్చాలి.

● నియమాలను పాటించాలి..

బాణాసంచా విక్రయించే దుకాణదారులు దుకాణాల వద్ద బకెట్లలో గానీ, రెండు డ్రముల్లో గానీ నీటిని ఉంచుకోవాలి. వీటితో పాటు 2 ఫైర్ కంట్రోల్ సిలిండర్లనూ ఏర్పాటు చేయాలి. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగితె వెంటనే 101కు ఫోన్ చేయాలి. దుకాణం దుకాణం మధ్య స్థలం విడిచి ఉండాలి. ప్రతి ఒక్కరూ విక్రయదారుడు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలి. నిబంధనల ప్రకారం నడుచుకోవాలి.

జిల్లా అగ్నిమాపక అధికారి డి. ప్రభాకర్



మూడోసారి పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తాం

● లక్ష్మణచాంద తహసీల్దార్ జానకి



పోలీసుస్టేషన్‌లో ఉన్న ఇసుక టిప్పర్లు

లక్ష్మణచాంద, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అక్రమ ఇసుక తరలిస్తూ మూడోసారి పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తామని తహసీల్దార్ జానకి బుధవారం హెచ్చరించారు. గత సోమవారం అర్ధరాత్రి పట్టుబడిన టీఎస్ 16 యూబీ 3782, టీఎస్ 16 యూబీ 1880 అనే రెండు ఇసుక టిప్పర్లకు ఒక్కో టిప్పర్‌కు రూ.25,000 చొప్పున మొత్తం రూ. 50 వేలు జరిమానా విధించామని తెలిపారు. ఈ మొత్తం చలాన్ కట్టిన అనంతరం వాహనాలను రిలీజ్ చేస్తామని, అప్పటివరకు ఈ వాహనాలు పోలీస్ స్టేషన్‌లోనే ఉంటాయన్నారు. అనుమతి లేకుండా ఎవరు ఇసుక తరలించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

ఇథనాల్‌కు వ్యతిరేకంగా అర్ధనగ్నంగా నిరసన

దిలావర్‌పూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా బుధవారం రైతులు రిలే దీక్ష శిబిరంలో అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఇక్కడి నుంచి ఇథనాల్ పరిశ్రమ తరలిపోయే వరకు పోరాటం ఆపేది లేదని వారు స్పష్టం చేశారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ఇథనాల్ పరిశ్రమ నిర్మిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. త్వరలో ఆమరణ దీక్ష చేపట్టేం దుకు నిర్ణయించామని, జరగరానిది ఏదైనా జరిగితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

దండారి వేడుకల్లో బిజీ బిజీగా ఖానాపూర్ ఎమ్మెల్యే

• సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్న వెడ్మ బొజ్జు భావితరాలకు తమ సంస్కృతి, సాంప్రదాయాలు అందించాలని ప్రయత్నం • దొంగచింతలు భోగిపండుగ


దండారి బృందానికి ప్రభుత్వ సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే


గుస్సాడి టోపీ ధరించిన ఎమ్మెల్యే బొజ్జుపటేల్


మోతిరామ్‌గూడలో కోలాటం ఆడుతున్న ఎమ్మెల్యే

ఉట్నూర్, అక్టోబరు 30 : ఖానాపూర్ నియోజక వర్గానికి చెందిన ఆదివాసీ గిరిజన ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ దండారి వేడుకల్లో బిజి బిజీగా కాలం గడుపుతున్నారు. ఆదివాసీ సాంప్రదాయాలను చిన్న తనం నుంచి పునికి పుచ్చుకున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్ భావితరాలకు తమ సంస్కృతీ సంప్రదాయాలు అందించాలని గ్రామ గ్రామాన వేడుకుంటున్నారు. గత నాలుగు రోజులుగా ఖానాపూర్ నియోజక వర్గంలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఖానాపూర్, కడెం, పెంబి, జన్నారం, సిరికొండ మండలాల్లోని దండారి బృందాల ఆహ్వానం మేరకు ఆయా గ్రామాలకు చేరుకుని దండారి బృందాలతో కలిసి ఆట పాట ఆడుతున్నారు. బుధవారం ఉట్నూర్ మండలంలోని బీర్సాయిపేట మోతిరంగుడా, ఏందా రాముగూడ, దుర్గాపూర్, నర్సాపూర్, ప్రాంతాలలో పర్యటించి గుసాడి దండారి బృందాల వేడుకల్లో పాల్గొన్నారు. ఆయా గ్రామాలకు చేరుకున్న వెంటనే అక్కడి గుసాడి బృందాలు ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అడవిలో పుట్టిఅడవిలో పెరుగుతున్న ఆదివాసీ గిరిజనులు తమ సంస్కృతి సాంప్రదాయాలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారని, రాబోయే తరానికి తమ సంస్కృతిని పదిలంగా పరిచయం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని ఒక్కో గుస్సాడి బృందానికి 15వేల వంతున 1000 బృందాలకు కోటి 50లక్షలు మంజూరు చేయడం చారిత్రాత్మకం అన్నారు. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి దండారి నిధుల గురించి కోరగా ముఖ్యమంత్రి ఒకే మాటకు ఆదివాసీ గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని కోరుతూ అధికారులకు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో పర్యటిస్తూ ఐటీడీఏ పీవీటీ జీపీపీఓ మేస్రం మనోహర్ తెచ్చిన నిధులను వారికి అందించారు. ఈ సందర్భంగా సాంప్రదాయ దుస్తులైనదోవతి, షర్టు ధరించి దండారి బృందాలతో కలిసి ఉట్నూర్ మండలంలోని బీర్సాయి పేట్- మోతిరామ్‌గూడ గ్రామంలో దండారి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ఎత్మానూరు దేవతకు పూజలుచేసిన అనంతరం కోలాటం చచ్చోయ్ నృత్యం చేశారు. ఆయన వెంట ఆదివాసీ గిరిజన నాయకులతో పాటు మడావి మోతిరాం, వెడ్మకోద్దు పటేల్, సింగిల్ విండో చైర్మన్ ఎస్పీరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖయ్యుం, లింగంపల్లి చంద్రయ్య, మొహమ్మద్‌ఇక్బాల్, దూట రాజేశ్వర్, మరసుకోల తిరుపతి తదితరులున్నారు.

మత్తడిగూడలో దండారి సంబరాలు...

ఉట్నూర్ మండలంలోని శంభుపటేల్ మత్తడిగూడలో దండారి సంబరాలు అంబరాన్ని అంటాయి. కీర్తిశేషులు సిడాంశంభు స్వగ్రామమైన మత్తడిగూడలో ఆయన ప్రారంభించిన దండారి వేడుకల కార్యక్రమాన్ని ఆయన తనయుడు నిర్వహిస్తున్నారు. జైనూరు మండలం మార్లవాయికి చెందిన 200 మంది దండారి బృందం మత్తడిగూడకు రావడంతో వారిని స్వాగతించి గుసాడి బృందాలతో దండారి సంబరాలు నిర్వహించారు. కనక వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తరలివచ్చిన మరలవాయి బృందంతో కలిసి మత్తడిగూడ బృందం దండారి, చోచ్చాయ్, డోల్‌కిబృందం ఆధ్వర్యంలో ప్రదర్శనలు ప్రదర్శించి ఆనందంగా దండాలు వేడుకలు నిర్వహించుకున్నారు. మత్తడిగూడకు చెందిన శంభు తనయుడు లచ్చుపటేల్, సోనేరావు, శేషు ఇలా ఆధ్వర్యంలో అతిథ్యం అందించారు.

దొంగ చింతల్లో భోగిపండుగ

మండలంలోని దొంగ చింత కోలాం గిరిజన గ్రామంలో దండారి బృందం లేక పోయినప్పటికి గ్రామపటేల్ జుగాదిరావు ఆధ్వర్యంలో కుమ్మరికుంటకు చెందిన దండారి బృందాన్ని ఆహ్వానించి బుధవారం ఘనంగా బోగిపండుగ నిర్వహించుకున్నారు. పటేల్ బాజీరావు ఇంటి ఆవరణలో గుసాడి టోపీలు, దండారి వాయిద్యాలు, దండారి అలంకరణ వస్తువులను ఒక వద్ద పేర్చి ఎత్మాసూర్‌కు మొక్కుతు ఆదివాసీ గిరిజనులు భోగిపండుగను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కుమ్మరికుంట దండారి బృందం ఆధ్వర్యంలో దండారి నృత్యాలను ప్రదర్శించారు.

గత ప్రభుత్వంలో విద్యుత్ ఛార్జీలు పెంచి దోచుకున్నదేవరో ప్రజలకు తెలుసు

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చంటి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చంటి

బోథ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీలు పెంచి దోపిడీకి తెరలేపింది ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పి.చంటి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూయ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి చార్జీలు పెంచే ఆలోచన లేదని ప్రజలకు అనుగుణంగా రాష్ట్రంలో ప్రజా పాలన కింద దాదాపు 50 లక్షల కుటుంబాలు వారికి ఉచిత విద్యుత్ అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుదల కేవలం పుకార్లేనని పుకార్లు సృష్టించింది టీఆర్ఎస్ వాళ్ళేనని పేర్కొన్నారు. పాలాభిషేకాలు చేసుకోవడం వెర్రితనంతో పాటు బీఆర్ఎస్ పార్టీ వారు తమ ప్రవర్తన మార్చుకోవాలన్నారు. వారి రాజకీయాలు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అన్నారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్థులు

• దేవాపూర్ గ్రామంలో ఇరు వర్గాలమధ్య ఉద్రిక్తత పరిస్థితి


మొరం టిప్పర్లను అడ్డుకుంటున్న దేవాపూర్ గ్రామస్థులు

తలమడుగు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాపూర్ గ్రామంలో బుధవారం మట్టిని తరలిస్తున్న లారీలను, జేసీబీలను గ్రామస్తులను అడ్డుకోవడంతో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. గ్రామస్థుల వివరాల ప్రకారం చెరువు మట్టిని నేల సారవంతం కోసం వ్యవసాయ భూమిలో వినియోగిస్తుంటారు. కాని ఒక ప్రముఖ వ్యక్తి తన వ్యవసాయ భూమిలో చెరువు మట్టిని గతంలో డంపు చేసి ఇప్పుడేమో తన వ్యవసాయభూమిలో కాకుండా ఇతర లాభదాయక కార్యకలాపాలకు వాడటంతో అడ్డుకున్నట్లు తెలిపారు. చెరువు మట్టి ఇలా తరలిస్తుంటే మాలాంటి చిన్న రైతులు ఎక్కడికి పోవాలని వ్యాపారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని లేదంటే ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని గ్రామస్థులు హెచ్చరించారు.

అదుపు తప్పి కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు


ఘటన స్థలంలో నుజ్జునుజ్జయిన కారు

ఇచ్చోడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ మండలంలోని ఇస్లాంనగర్ సమీపంలో ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిపై అదుపుతప్పి కారు బోల్తాపడినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన గిరిధర్ ఆయన భార్య కూతురు కారులో నిర్మల్ వైపు నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తుండగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బార్య, భర్తలకు ఇరువురికి గాయాలవ్వగా.. కూతురికి ఎలాంటి గాయాలు కాలేదని వారు పేర్కొన్నారు. 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు 108 పైలెట్ దిలీప్, ఈఎన్‌టీ శ్రీకాంత్ తెలిపారు.

కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం



బోథ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలపై పడే విద్యుత్ బారాన్ని నిలిపివేయించినందుకు గాను మాజీ ఎంపీపీ తులశ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాలు పెంచలేదని అయితే అందుకు భిన్నంగా 10 నెలలోనే 18 వేల 500 కోట్ల రూపాయలు ప్రభుత్వం విద్యుత్ బిల్లును పెంచేందుకు ప్రయత్నించిందని అన్నారు. ప్రభుత్వం ధరలు పెంచితే ఊరుకునేది లేదని ప్రధాన ప్రతిపక్షంగా కేటీఆర్ అడ్డుకోవడంతో ప్రభుత్వం తన ప్రాతిపాదనను విరమించుకోవడం జరిగిందన్నారు. ఇది ప్రజా విజయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీధర్‌రెడ్డి, సురేష్‌బాబు సింగ్, బొడ్డు శ్రీనివాస్, నల్లగొండ ప్రశాంత్, మాజీ ఉప సర్పంచ్ రవిలు పాల్గొన్నారు.

'ప్రిన్సిపాల్‌గా బాధ్యతతో విధులు నిర్వహిస్తా'

బోథ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తాను చదివిన పాఠశాలలోనే ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించడం సంతోషంగా ఉందని, తాను ప్రిన్సిపాల్‌గా బాధ్యతగా విధులు నిర్వహిస్తానని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ అన్నారు. బుధవారం ఆమె సహచర పూర్వ విద్యార్థులైన రమణ, ముత్యం రాములు వెల్ఫేర్ సొసైటీ తరపున శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను చదివిన పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే పాఠశాలకు గుర్తింపు వచ్చే విధంగా పనిచేస్తానని పేర్కొన్నారు.

ఫోటోరైటప్ :309 ఏడీబీ30 : బోథ్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ముత్యం రాములు వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

2వ తేదీ వరకు సోయాబీన్ పంట కొనుగోలు నిలిపివేత

బోథ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ ఆధ్వర్యంలో సోయాబీన్ పంట కొనుగోలు నవంబర్ 2వ తేదీ వరకు నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి గోలి స్వామి తెలిపారు. పంటను బోథ్‌మార్కెట్ యార్డుకు తీసుకువచ్చే రైతులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని సహకరించాలని కోరారు.

ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు గొప్పవి

బోథ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవని స్థానిక ఎస్సై ప్రవీణ్ పేర్కొన్నారు. బుధవారం పాట్నాపూర్ గ్రామంలో నిర్వహించిన దండారి ఉత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. అభిమానంతో నన్ను ఆహ్వానించినందుకు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు హరీష్, కుమ్మరి విజయ, పాట్నాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

భలా చిన్నోడా..అని అభినందించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

భీంపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చిన్నతనంలోనే ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు తాను చేపట్టిన దీక్ష అద్వితీయం. నేటి కంప్యూటర్ యుగంలో కూడా మన ఆచార వ్యవహారాలను ఉట్టిపడేలా కళ్ళకు కట్టినట్లు చూపించిన ఆ చిన్నారి బాలుడిని బెల్సారీ రాంపూర్‌లో ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అభినందించారు.

కోతుల సమస్యకు


పరిష్కారం చూపేలా చర్యలు చేపడతాం

• సర్వసభ్య సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

ఖానాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఇటీవ కోతుల బెడద తీవ్రమైన నేపథ్యంలో వాటి బారి నుండి పట్టణ ప్రజలకు రక్షణ కల్పించేలా చర్యలు చేపడతామని మున్సిపల్ చైర్మన్ చిన్నంసత్యం అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో తన అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్మించిన ఉద్యానవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఈ మున్సిపల్ పార్క్ ఎదుట గల ఖాళీ స్థలంలో ఐలవ్ ఎంసీకే పేరు నిర్మాణం చేయిస్తున్నామన్నారు. అంబేద్కర్ నగర్ కాలనీలో గల స్మశాన వాటికను సైతం త్వరలో ప్రారంభిస్తామన్నారు. వార్డుల వారీగా నిరంతరం పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నామని ఇంకా ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని చైర్మన్ కౌన్సిలర్లను కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కావలి సంతోష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు జన్నారపు విజయలక్ష్మి శంకర్, పరిమి లత సురేష్, కిషోర్ నాయక్, కురుమ శ్రీనివాస్, ఫౌజియా షబ్బీర్ పాషా, కోఆప్షన్ సభ్యులు బండారి కిషోర్, తదితరులున్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు



నిర్మల్ కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శ్రేణులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని బీఆర్ఎస్ పార్టీ పోరాటం వల్లనే వెనక్కి తీసుకుందని నాయకులు తెలిపారు. 18,500ల కోట్ల భారం ప్రస్తుతానికి తగ్గిందని ఈ సందర్భంగా శ్రేణులు స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నాయి. నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, నాయకులు డాక్టర్ యు.సుభాష్‌రావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారం పడకుండా అడ్డుకున్నాం

ఖానాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై వేయాలనుకున్న రూ. 18,500ల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని విజయవంతంగా బీఆర్ఎస్ అడ్డుకుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు రాజగంగన్న అన్నారు. ఈ మేరకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, స్థానిక నియోజకవర్గ ఇంచార్జి భూక్యా జాన్సన్‌నాయక్ పిలుపు మేరకు బుధవారం బీఆర్ఎస్ ఖానాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తాలో టపాసులు పేల్చి కార్యకర్తలకు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బీసీ రాజన్న, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపే విలాస్, రైతు బంధు సమితి జిల్లా మాజీ డైరెక్టర్ కొక్కుల ప్రదీప్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శనిగారపు శ్రావణ్, పట్టణ అధ్యక్షులు గౌరీకర్‌రాజు, జిల్లా నాయకులు సల్ల నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


సమావేశానికి హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ అంశాలపై ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహణపై అధికారులకు నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్‌లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి 150 గృహాలకు ఒక ఎన్యుమరేషన్ బ్లాక్‌గా పరిగణించాలన్నారు. ప్రతి ఎన్యుమరేషన్ బ్లాక్‌కు ఒక ఎన్యుమరేటర్ అధికారి బాధ్యుడిగా ఉంటారని, కేటాయించిన ఎన్యేమరేషన్ బ్లాక్‌లోని ప్రతి కుటుంబానికి సంబంధించి నిర్దేశించిన అన్ని వివరాలను సేకరించాలని ఆదేశించారు. సేకరించిన అన్ని వివరాలు ఖచ్చితత్వంతో ఉండాలన్నారు. ప్రతి అధికారి సమయానికి తమకు కేటాయించిన ప్రదేశానికి చేరుకొని సర్వేను ప్రారంభించాలన్నారు. సర్వే నిర్వహించిన ప్రతి ఇంటికి సర్వే పూర్తయినట్లుగా తెలిపే స్టిక్కర్‌ను అతికించాలన్నారు.

సర్వే వివరాల డాటాను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నమోదు చేయాలని సూచించారు. సూపర్‌వైజర్లు ఎన్యుమరేటర్ అధికారి నిర్వహించిన సర్వేలోని 10 శాతం వివరాలను ర్యాండంగా తనిఖీ చేయాలని, సర్వే సమయంలో ఏవైనా ఇబ్బందులు తలెత్తినా పై అధికారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు అధికారులకు శిక్షణ ఇచ్చి సర్వేకు సంబంధించిన వివరాల నమోదులో సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి జీవరత్నం, డీపీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో గోవింద్, ట్రైనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంటలన్నింటికీ కనీస మద్దతు ధర ప్రకటించాలి

• ఏఐపీకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐపీకేఎస్ నాయకులు


పెంబి తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఖానాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ప్రతి పంటకు ప్రభుత్వం వెంటనే కనీస మద్దతు ధరను ప్రకటించాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నందిరామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నందిరామయ్య మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలన్నారు. వ్యవసాయ మార్కెట్‌లలో దళారుల అక్రమ దోపిడీని అరికట్టాలన్నారు. అకాల వర్షాలకు తడిసిన పత్తి, మొక్కజొన్న, వరి లాంటి పంటలను ప్రభుత్వం ఎంఎస్పీ ధరలకే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా వెంటనే టార్పాలిన్ కవర్లను పంపిణీ చేయాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం బేషరతుగా రూ. 2 లక్షల రుణమాఫీని అమలు చేయాలన్నారు. దొడ్డు, సన్న రకం ధాన్యంతో పాటు రైతు పండించిన ప్రతి పంటకు క్వింటాల్‌కు రూ.500ల బోనస్‌ను ప్రకటించాలన్నారు. ఖరీఫ్, రబీలకు కలిపి వెంటనే రైతుల ఖాతాలలో రైతు భరోసా పథకం కింద రూ. 15,000 జమ చేయాలన్నారు. 58 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు, వ్యవసాయ కార్మికులకు పదివేల చొప్పున పించన్ అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శివరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జక్కుల రాజన్న, కుంచెపు ఎల్లయ్య, అడ్డగడ్ల శంకర్, మచ్చ శ్రీనివాస్, కురుమ రాజన్న, తదితరులున్నారు.

రైతులకు కనీస మద్దతు ధర కేటాయించాలి

పెంబి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఖరీఫ్ పంటలన్నింటికీ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సమగ్ర ఖర్చుల ప్రాతిపదికన కనీస మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను విస్తృతంగా ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నందిరామయ్య అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తేమ పేరుతో పంట ధరలు తగ్గించరాదని, అకాల వర్షాలకు తడిసిన పత్తి, వరి, మొక్కజొన్నలకు ప్రభుత్వం ఎంఎస్పీ ధరకే కొను గోలు చేసి రైతులను ఆదుకోవాలని, పంట ఉత్పత్తులు తడవకుండా టార్పాలిన్‌లను ఉచితంగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐపీకేఎస్ జిల్లా నాయకులు కే. ఎల్లయ్య, ఏ. శంకర్, కురుమ రాజన్న, షేక్ గోరేబాయ్, పి. భోజన్న, తదితరులున్నారు.

నాయకులు క్రియాశీల సభ్యత్వం తీసుకోవాలి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ నాయకులు తప్పనిసరిగా క్రియాశీల సభ్యత్వం తీసుకోవాలని జిల్లా అధ్యక్షుడు కే.అంజుకుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులకు క్రియాశీల సభ్యత్వం కల్పించారు. ప్రాథమిక సభ్యత్వం పూర్తయిన వారు క్రియాశీల సభ్యత్వం తీసుకోవాలన్నారు. సభ్యత్వ కోఆర్డినేటర్ సామ రాజేశ్వర్‌రెడ్డి, రావుల రాంనాథ్, ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మె రాజు, ఒడిసెల అర్జున్, సాధం అరవింద్, తోకల అనిల్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

దిలావర్‌పూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటా కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో అరుణరాణి అన్నారు. సామాజిక, ఆర్థిక విద్య, ఉపాధి, రాజకీయ, కులాలపై బుధవారం ఎంపీపీ కార్యాలయంలో సర్వే శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాల ఆర్థిక, సామాజిక స్థితిగతులపై సమగ్ర సమాచారం పొందుపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గోవర్ధన్, ఏవో రాజశేఖర్ రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో దివ్యరెడ్డి, ఏపీఎం సులోచన, తదితరులు పాల్గొన్నారు.

2న మస్కాపూర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీలు

ఖానాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వచ్చే నెల 2వ తేదీన ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్, ఆర్గనైజర్ పీడీ షేక్ ఇమ్రాన్‌లు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా పరిధిలోని నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన 17 ఏళ్లలోపు బాల, బాలికలు హాజరు కావాలన్నారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులు వారు చదివే పాఠశాల స్టడీ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్‌కార్డు నాలుగు జిరాక్స్‌సెట్లను వెంట తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు 9963168632, 9440874697 నెంబర్లను సంప్రదించాలన్నారు.

కుల గణన సమయం మార్చండి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కుల గణన సమయం ఉపాధ్యాయులకు అనుకూలంగా మార్చాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంగం కోరింది. జిల్లా అధ్యక్షుడు రాజేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్ విడుదల చేసిన ప్రకటనలో ఉపాధ్యాయులు దూర ప్రాంతాల నుంచి రానున్నందున మధ్యాహ్నం నిర్వహించేలా చూడాలని కోరారు.

దత్తసాయి ఆలయంలో దీపోత్సవం

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం గండిరామన్న దత్తసాయి ఆలయంలో దీపావళి సందర్భంగా బుధవారం దీపోత్సవాన్ని నిర్వహించారు. సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సాయి బాబా ఆలయంలో దీపాలను వెలిగించారు. భక్తులు, మహిళలు ఆయనతోపాటు దీపాలు వెలిగించారు. ఉప్పుల నందు, జిందం గోవర్ధన్, రేఖ, సాయిరాం, ఆలయ పూజారులు పాల్గొన్నారు.


పాఠశాలల్లో ముందస్తు దీపావళి వేడుకలు

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని వశిష్ఠ ఇంపెల్స్ ఈ టెక్నోస్కూల్‌లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. చైర్మన్ జి.శ్రీనివాస్‌గౌడ్, ప్రిన్సిపాల్ మాధవి, డైరెక్టర్ దేవిదాస్ పాల్గొన్నారు. దీపావళి పండగ విశిష్టత విద్యార్థులకు వివరించారు.

విజయ స్కూల్‌లో..

విజయ హైస్కూల్‌లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లక్ష్మీపూజలో విద్యార్థులు, యాజమాన్యం పాల్గొంది.





విస్తృతంగా టోల్‌ఫ్రీ నెం. ద్వారా విద్యుత్ శాఖ సేవలు

- ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాస్

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు టోల్ ఫ్రీ నెం.1912 సేవలు విస్తృత పరుస్తున్నట్టు ఎస్ఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ సద్వి నియోగించుకోవాలని ఆయన కోరారు. ట్రాన్స్ ఫార్మర్‌లపై నెం. 1912 ముద్రిస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు టోల్ ఫ్రీ నెం.పై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు, బిల్లులతో వ్యత్యాసాలు, మీటర్ల మార్పు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, కొత్త కనెక్షన్ తదితర సమస్యలు పరిష్కరించుకోవచ్చునన్నారు. సాంకేతికతను జోడించి 1912 కార్పొరేట్ కార్యాలయానికి అనుసంధానం చేసినట్టు తెలిపారు.



కొమురంభీం ఆశయ సాధనకు కృషి

- భీంపూర్‌లో విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ నగేష్

భీంపూర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ఆరాధ్య దైవం కొమురంభీం అని ఎంపీ గోడం నగేష్ అన్నారు. ఆయన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపూరావులతో కలిసి మండలకేంద్రంలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన భీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ నగేష్ మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ నినాదంతో ఆదివాసీలను చైతన్యం చేశారన్నారు. బోథ్ ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ దండరి బృందాలకే రూ.10 వేల సహాయం అందించారని, ప్రస్తుత ప్రభుత్వం కూడా దండరీలకు ఇస్తానన్న రూ.15 వేల సహాయం వెంటనే అందించాలని సూచించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ అందరం కలిసి ఈ మండలాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. మాజీ ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ భీం ఆదివాసీల కోసం అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. ఇందులో మాజీ జడ్పీటీసీలు కుమ్ర సుధాకర్, తాటిపల్లి రాజు, మాజీ ఎంపీపీ కుడిమేత సంతోష్, ఆదివాసీ నాయకులు మడావి లింబాజీ, సీడం పురుషోత్తం, రవీందర్ జాదవ్, ధరమ్‌సింగ్ రాథోడ్, రాథోడ్ ఉత్తం, తదితరులు పాల్గొన్నారు.


భీంపూర్‌లో భీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు


చర్లపల్లిలో దండారి ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ నగేష్

- ఆదివాసీల సంస్కృతిని గుర్తించే కనకరాజుకు అవార్డు

తలమడుగు(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సంస్కృతీ, సంప్రదాయాలను గుర్తించే ఆదివాసీ అయిన దివంగత కనకరాజుకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును అందించిందని ఎంపీ గోడం నగేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చర్లపల్లి గ్రామంలో నిర్వహించిన దండారి ఉత్సవానికి ముఖ్యఅతిథిగా ఎంపీ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందన్నారు. అదేవిధంగా అరులైన ప్రతిఒక్కరూ అయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తారని వారికి హామీనిచ్చారు. అనంతరం గిరిజన దేవతలకు ప్రత్యేక పూజలునిర్వహించారు. ఇందులో జిల్లా నాయకులు కనపర్తి చంద్రకాంత్, తాంసి మాజీ జడ్పీటీసీ రాజు, వెంకటస్వామి, మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, తాంసి మాజీ ఎంపీపీ అరుణ్, ఎల్‌టి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, రామ్‌రెడ్డి, కృష్ణ పటేల్, ప్రసాద్, రాంజీ, తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి పత్తి పంట కొనుగోళ్లు : గజానంద్

బోథ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నవంబరు 7వ తేదీ నుంచి మండలంలో పత్తి పంట కొనుగోలు ప్రారంభమవుతాయని జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ గజానంద్ పేర్కొన్నారు. బుధవారం బోథ్ మార్కెట్ కార్యాలయంలో పత్తి పంట కొనుగోళ్లపై స్థానిక వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి మార్కెట కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అధ్యక్షత వహించగా జిల్లా మార్కెటింగ్ అధికారితో పాటు బోథ్ మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు. నవంబర్ 7న సోనాల జిన్నింగ్, 8న బోథ్ జిన్నింగ్‌లలో పత్తి పంట కొనుగోలు ప్రారంభించడం జరుగుతుందన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా జిన్నింగ్ వ్యాపారులు మార్కెటింగ్ అధికారులతో కలిసి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అంతేగాక మార్కెట్‌కు పత్తిని తేమతో తేవద్దని, తేమ ఉంటే కొనుగోలు జరగవన్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా పత్తి పంట కొనుగోలు సాయంత్రం 6గంటల వరకే జరుపుతారని 6 గంటల తర్వాత కొనుగోలు జరిపినా కంప్యూటర్లు పని చేయవన్నారు. ఈ విషయాన్ని గుర్తించి రైతులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యాపారులు, కస్తూరి విశ్వనాథ్, శ్రీధర్, సంపత్‌కుమార్‌లతో పాటు సోనాల, నేరడిగొండ జిన్నింగ్‌ల యజమానులు పాల్గొన్నారు.





రహదారిపై పశువులు.. ప్రయాణికులకు తప్పనితిప్పలు

- పట్టించుకోని పంచాయతీ అధికారులు

ఇంద్రవెల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఇంద్రవెల్లిలో ప్రధాన రహదారిపై పగలు, రాత్రి వేళలో పశువులు రోడ్లపై సంచరిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. తరచూ పశువుల సంచారం కారణంగా ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. మండలకేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే వారసంత రోజు అయితే ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసు సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రయాణికులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. పశువుల యజమానులు ఇళ్లలో పశువులను కట్టేసుకోవాలని మేజర్ గ్రామపంచాయతీ సిబ్బంది ఇప్పటికే మండలకేంద్రంలో ప్రచారం చేశారు. పశువుల వల్ల వాహనదారులు ఇబ్బందులు పడితే యజమానులపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నప్పటికీ.. ఇప్పటి వరకూ ఎవరిపైనా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పశువుల సంచారంపై స్థానికులు అనేకసార్లు ఫలితం కనిపించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. పశువులు ప్రధాన రహదారిపై తిరగడం, పరిగెత్తడం, పడుకోవడం వంటి పనులు చేయడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

జర దేఖో!!


ఇంద్రవెల్లిలో ప్రధాన రహదార్డిపై వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న పశువులు ఇలా..













ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.3। కనిష్ఠం 23.2

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
గురువారం 31 అక్టోబరు 2024

దళారులను నమ్మొద్దు

బోథ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : లైసెన్స్‌లు లేని దళారులు రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు చేయవద్దని బోథ్ మార్కెట్ కమిటీ సెక్రటరీ విఠల్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సోనాల, బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో పంట కొనుగోలు చేస్తున్న దుకాణాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన వివిధ రకాల పంట కొనుగోళ్ళు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని లేకుంటే కేసులు తప్పవన్నారు. వారం రోజుల్లోగా లైసెన్స్‌లను పొందాలన్నారు.



జిల్లాలో దీపావళి సందడి

● మార్కెట్ బిజీ..బిజీ


పట్టణంలో వెలిసిన ప్రమిదాల దుకాణం

ఆదిలాబాద్అర్బన్/ఆదిలాబాద్ రూరల్ అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎంతో ఆతృతగా ఎదురు చూసే దీపావళి పండుగ రానే వచ్చింది. హిందూ పండుగలలో ప్రజలకు, వ్యాపారులకు పవిత్రంగా భావించే దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకోనున్నారు. ఇందుకు జిల్లాలోని ప్రజలు వ్యాపారస్తులు తమ గృహాలను, వ్యాపార సముదాయాలను శుద్ధి చేసి సిద్ధం చేశారు. కాగా జిల్లాలోని నలుమూలల నుంచి జిల్లా కేంద్రానికి దీపావళి పండగను పురస్కరించుకొని ప్రత్యేక సముదాయాలతో జిల్లా కేంద్రం సందడిగా మారింది. మార్కెట్‌లో ఏర్పాటు చేసిన దీపాలు, విద్యుత్ దీపాలతో పాటు తినుబండారాలు సిద్ధం చేశారు. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు, వ్యాపారస్తులు జిల్లా కేంద్రానికి బారులు తీరడంతో మార్కెట్‌లో సందడి నెలకొంది. ఇటు మార్కెట్‌లో దీపావళి పండుగ సందర్భంగా ప్రజలు పెద్దఎత్తున పూజ సామాగ్రిని కొనుగోలు చేసేందుకు బారులు తీరడంతో అంబేద్కర్ చౌక్‌లో పెద్ద ఎత్తున సందడి నెలకొంది. అటు టపాసులను సైతం విక్రయించేందుకు సిద్ధంగా ఏర్పాటు చేయడంతో పిల్లలు, పెద్దలు యువకులు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. ప్రజలందరు తమ ఇండ్లలో పెద్ద ఎత్తున లక్ష్మీదేవిని తమ గృహాలలో అలంకరించుకునేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా మార్కెట్‌లో బుధవారం పెద్దఎత్తున దీపావళి సందడి కనిపించింది. ప్రతి ఒక్కరూ తమ ఇండ్లలో నిర్వహించుకునే పూజల కోసం పెద్ద ఎత్తున మార్కెట్‌కు తరలివచ్చారు. గురువారం నరకచతుర్థశిని, మరు నాడు దీపావళి పండుగను నిర్వహించుకోనున్నారు. లక్ష్మీ పూజను పురస్కరించుకొని తమ వ్యాపార సముదాయంలో, ఇండ్లలో ప్రత్యే కతోరణాలు, అలంకరణలతో సిద్ధం చేసుకున్నారు.

● **జోరందుకున్న టపాసుల విక్రయాలు...**

దీపావళి పండుగ సందర్భంగా టపాసుల విక్రయాలు జోరందుకున్నాయి. జిల్లా కేంద్రంలోని స్థానిక రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల్లో విక్రయాలు కొనసాగుతున్నాయి. దీంతో టపాసుల దుకాణాలు సందడిగా మారాయి. వ్యాపారులు సుమారు 62 షాపులకు పైగా ప్రభుత్వం అనుమతితో ఏర్పాటు చేశారు. దీంతో జనం తాకిడి మరింత పెరిగింది. టపాసుల ధరలు మాత్రం పేలుతున్నా కొనక తప్పడం లేదని వినియోగదారులు అంటున్నారు.

భగ్గుమంటున్న ధరలు..

దీపావళి పటాకుల వ్యాపారం జిల్లావ్యాప్తంగా కోట్లలో నడుస్తుంది. గతేడాది కంటే ఈ సారి ధరలు పెరిగాయి. ముడిసరుకుల ధరలు పెరగడం పటాకుల ధరలకు రెక్కలొచ్చాయి. అన్ని రకాల బాంబులపై గతేడాది కన్నా ఈసారి 20 నుంచి 25 శాతం వరకు ధరల పెరిగాయి. ఇక దీపావళి పటాకుల్లో ఫ్యాన్సీ నావల్టీస్ కొనుగోలుపై ప్రజలు మక్కువ చూపిస్తున్నారు. పేలుడువి కాకుండా పువ్వులు వచ్చే క్రాకర్స్ మతాబులను విక్రయిస్తున్నారు.


పటాకులు కాల్చే సమయంలో జాగ్రత్త..

పటాకులు కాల్చే సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం సంభవిస్తుంది. పెద్ద పెద్ద బాంబులు కాల్చేటప్పుడు దూరంగా ఉండాలి. వీలైనంత వరకు వాటిని కాల్చకుండా ఉండడమే మేలు. చిన్న పిల్లలను బాంబులు కాల్చే చోటుకు రానివొద్దు. వారికి స్థాయిని బట్టి కాల్చే అవకాశం ఇవ్వాలి. తల్లిదండ్రులు, బంధువులు గమనిస్తుండాలి. పొగ ఎక్కువగా వచ్చే పటాకుల వల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నది. దమ్ము దగ్గు ఉన్న వారిని దూరంగా ఉంచితే మంచిది.















ఎంబీబీఎస్ విద్యార్థినికి సాయం


సాయిశ్రద్ధకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్, అక్టోబరు 30 : ఉమ్మడి జిల్లాలోని జైనూరు మండలం జెండా గూడకు చెందిన ఆదివాసీ విద్యార్థిని మేస్రం సాయి శ్రద్ధ ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ సాయిశ్రద్ధను శాలువాతో సత్కరించి, తనవంతుగా ఆర్థికసాయం బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా సాయిశ్రద్ధకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వెల్లడించారన్నారు. ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమ కోసం కృషి చేస్తుందని అనడానికి ఇదో నిదర్శనమని తెలిపారు. సాయి శ్రద్ధ కష్టపడి చదివి మరిన్ని ఉన్నత శిఖరాలను అదిరోహించాలని ఆకాంక్షిం చారు. కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ మేస్రం మనోహర్, మడావి శ్రీనివాస్, కుంరశ్రీనివాస్, సాయిశ్రద్ధ కుటుంబసభ్యులున్నారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి...

భీంపూర్ : ఆదివాసీ గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌లు అన్నారు. ఆయన బుధవారం డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి మండలంలోని బెల్సర్ రాంపూర్, నిపాని గ్రామాలలో నిర్వహించిన గుస్సాడీ వేడుకలకు హాజరై మాట్లాడారు. ముందుగా గ్రామస్తులు గిరిజన సంప్రదాయబద్దంగా డప్పుచప్పుళ్ళతో గుస్సాడీ వేషధా రణతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ గుడిమేత సంతోష్, శంకర్, మె స్రం నాగోరావు, అన్ను పటేల్ తదితరులు ఉన్నారు.









విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించాలి

● లైబ్రరీ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా

జైనథ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులలో పఠన సామర్థ్యం పెంపొందించాలని, విజ్ఞానాన్ని అందించాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం జైనథ్ మండలంలోని దీపాయి గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూమ్ టూ రీడ్ ఇండియా వారు ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరిని ప్రారంభించారు. ఈ సం దర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ఇంటి వద్ద నుంచి విలువలతో కూడిన విద్యాభ్యాసం అం దించాలని తెలిపారు. కార్యక్ర మంలో ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎం రవీం దర్, కాంప్లెక్స్ హెచ్ఎం విజయసారథి, గ్రామ కార్యదర్శి ఎల్.మహేందర్, మాజీసర్పంచ్ బొల్లగంగన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి

● అదనపు జిల్లా కలెక్టర్ శ్యామలాదేవి

తలమడుగు , అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటికి కుటుంబ సర్వే కార్యక్రమంలో భాగంగా నియమించబడిన ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన కుటుంబాలకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించాలని అదనపు జిల్లా కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. బుధవారం తలమడుగు మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ పాఠశా లలో, సిబ్బందికి సర్వే నిర్వహణపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అదనపు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన నిర్ణీత నమూనాలో స్పష్టంగా నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, విషయాలపై అవగాహన కల్పించారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్